కథానిక

# వింత ప్రణయం

వేదుల కామేశ్వరరావు

"ఇంక ఈ జన్మలో నన్ను ప్రేమించవా విశాలాక్షీ?" ఆఖరి సారిగా అడిగేశాడు, కళ్ళమ్మట వచ్చే నీళ్ళను జేబు రుమాలుతో తుడుచుకుంటూ, సుదర్శన్ అనబడే ఒకానొక సుదర్శనరావు.

"ఎక్స్యూజ్ మీ, మిష్టర్ సుదర్శన్! ఆ మధ్య నా మనస్సు ఫలానా 'రాజా' దగ్గర తాకట్టు పెట్టి కొంత ప్రేమను అప్పు తెచ్చుకొన్నాను ఇప్పుడది తీర్చెయ్యవలసిన అవసరం కలిగింది. అదీగాక, నాకున్న ఒక్క మనస్సూ ఇద్దరికెలా అర్పిస్తాను సుదర్శన్?" నిష్కర్షగా సమాధానం చెప్పింది సదరు విశాలాక్షి, కళ్ళు మరి కాస్త పెద్దవి చేస్తూ

సుదర్శనరావుకు దుఃఖం పెల్లుబికి వచ్చింది

"హుఁ విశాలాక్షీ!" అన్నాడు పళ్ళు పట పటా కొరుకుతూ. "అంతేనా విశాలాక్షీ?" అన్నాడు, మరొకసారి అడిగితే ఎందుకైనా మంచి దనుకొంటూ 'అంతే' నన్నట్లు విశాలాక్షి ముఖం ప్రక్కకు తిప్పింది విచారంగా.

"విధి మనకి ఎడబాటు ఎందుకు కలగ జెయ్యాలి విశాలా?" అన్నట్టు ప్రకృతి వైపొక్క సారి తీక్షణంగా చూశాడు సుదర్శనరావు

"ఏమో మరి!" అన్నట్టుగా విశాలాక్షి క్రిందికి చూసింది, కాలి గోటితో ఇసుక రేణువుల్ని మీటుతూ.

"ఆలోచించుకో విశాలాక్షి, ఆఖరిసారిగా చెబుతున్నాను మన ప్రేమ ఈ నాటిదికాదు నిన్ను కాలేజీలో చేరినప్పట్నుంచీ ప్రేమిస్తు న్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తున్నట్టే ఆశించాను. ఒక రోజు గడువిచ్చాను. ఆలోచించు" అంటున్న సుదర్శనానికి....

"ఏం చెయ్యను సుదర్శన్! నేనూ అలానే అనుకొన్నాను. కాని .... రాజాను ప్రేమించటం తప్పనిసరయింది మరి" అని సమాధానం చెబుదామని విశాలాక్షి అటు తిరిగే టప్పటికే అక్కడ్నుంచి సుదర్శనరావు చర చరా నడచి వెళ్ళిపోయాడు.

సుదర్శనరావు కోపంగా వెళ్ళిన వైపే ఐదారు నిమిషాలపాటు విచారంగా చూస్తూ నిలబడింది విశాలాక్షి అవును! ముందసలు సుదర్శన్నే ప్రేమిద్దామనే భావం ఆమెకు కలిగినమాట వాస్తవం. కాని.... ఈలోగా ఆ రాజా ఇంకో కళాశాలనుంచి ఇట్టే వస్తాడని ఆమె కేం తెలుసు! వస్తే మాత్రం, ఆమె మనస్సును ఇట్టే కట్టెయ్యగల సామర్థ్యం అతనిలో వుంటుందని ఆమెకు తెలియదుగా! అతను తెల్లటి డ్రెస్‌లో దర్జాగా ఉంగరాలు తిరిగిన జుట్టు ఊగుతుంటే నవ్వుతూ క్లాసులోకి ప్రవేశిస్తూంటే ఆమె మనస్సుకేమిటో చెప్పలేని ఆనందం కలుగుతున్నది ఓరగా అతడివైపు చూసి, సంతృప్తిగానవ్వి, పాఠం వినడానికి ఉపక్రమిస్తుంది కుమారి విశాలాక్షి.

* * *

సుదర్శనరావు తిన్నగా సముద్రపుటొడ్డు కెళ్ళి సిగరెట్లు తగలెయ్యటం మొదలుపెట్టాడు. తరంగాలన్నీ కలుసుకొని కెరటంగా తయారయి ఏదో అభ్యుదయం సాధించేలా పైకెగిరి చివరకు గట్టును తాకి చితికిపోయి, మళ్ళీ నీళ్ళలో కలుసుకొంటున్నాయి తన ప్రేమ తరంగాలూ అలానే వున్నాయి. ఎవరినో ఒక "స్వప్నసుందరి"ని ప్రక్కన పెట్టుకొని జీవిద్దామనుకొన్న తన ఆశయాలన్నీ రాజా అనే ఒక వ్యక్తి ఆగమనంతో చితికిపోయాయి విశాలాక్షి ఇంక తనను ప్రేమించదు. ఒకనాడు తననే నమ్మి, తనకన్న ఇక ఆప్తులెవరూ లేరనుకొన్న విశాలాక్షి! "హుఁ...." ఈనాడు తన్ను త్యజించి మరొక వంతగాడికి వింత ప్రణయం చూపెడుతున్నది!

సుదర్శనరావు గుండెల్లో కుంపటి రాజుకొంటోంది. దెబ్బతిన్న పక్షిలా ప్రేమ భిక్ష కోసం దబదబా కొట్టుకొంటున్నాడు ఎన్నాళ్ళ నుంచో విశాలాక్షి కోసం ఓపికపట్టి, అనేక కష్టనిష్టూరాలకు సహించి వేచి వున్నాడు ఆ మాయలాడి తన్ను నమ్మించి ద్రోహం చేసింది. తియ్యటి కబుర్లతో తన్ను జోకొట్టి, ఇంకొకనితో సంతోషం పొందాలనుకొంటోంది.

"ఆనాటి విశాలాక్షి" .... ఆలోచిస్తున్నాడు సుదర్శనరావు. ఆ నాటి విశాలాక్షి నిజంగా ఎంత అందంగా ఉండేది? ఎంత మైమరపించేలా మాట్లాడి, అరచేతిలో స్వర్గం చూపించేదో! ఒక సంవత్సరం క్రితం జరిగిన సంఘటనే!

కాలేజీలో చేరగానే విశాలాక్షి జీతం కడుతోంది జీతం కట్టడం కోసమే తనూ వెళ్ళాడు. నిజానికి విశాలాక్షిని ప్రేమించడానికి వెళ్ళ లేదు. కాని ఆమెను అంతగా ప్రేమించటం తప్పనూలేదు విశాలాక్షి వందరూపాయల కాగితం ఇచ్చింది క్లర్కుకు "చిల్లరలేదండి" అన్నాడు క్లర్క్ ఆమెకాగితం తిరిగి ఇచ్చేస్తూ. "నాదగ్గరుంది లెండి" అంటూ డబ్బుతీసి క్లర్క్ చేతికి ఇచ్చాడు తను. విశాలాక్షి సంతృప్తిగా చూసి సన్నగా నవ్వింది. "మీ ఎడ్రసు తెలిపితే సాయంకాలం పంపిస్తాను" అన్నది మెల్లగా

"ఫరవాలేదు లెండి" అన్నాడు తను మర్యాదకోసం.

"అంటే?" అన్నది ఆమె కోపంగా

"అబ్బే ఇవ్వొచ్చులెండి, తొందరలేదు" అంటూనే తన ఎడ్రసు ఇచ్చాడు. "థాంక్స్" అని మెల్లగా వెళ్ళిపోయింది విశాలాక్షి.

సాయంత్రం తన రూమ్‌కు వచ్చింది ఆమె.

"కూర్చోండి" అన్నాడు తను.

"కూర్చోడానికి రాలేదండి" అంది ఆమె

"కూర్చోడానికి ప్రత్యేకంగా రారుగా. ఏదో పనిమీద వచ్చినప్పుడు ఆ పని అయ్యేవరకైనా కూర్చోవాలి" అన్నాడు తను నవ్వుతూ.

ఆమె నిలబడే అతడి పుస్తకాలన్నీ పరీక్షించింది. గది నాలుగుమూలలా పరికించింది గోడకు వ్రేలాడే చిత్రాలన్నీ చూసి, "ఇవన్నీ మీరు గీచినవేనా?" అంది. "నేనే ఏమీ తోచనప్పుడు గీస్తూవుంటాను. కొంచెం చిత్రలేఖనం నేర్చుకొన్నాను" అన్నాడు తను సిగ్గుపడుతూ "చాలా బాగున్నాయ్" అంది ఆమె వాటివైపు పరీక్షగా చూస్తూ

ఆమె నొక చిత్రంగా గీయాలని తను ఊహించుకొనేలోగానే "వెళ్ళొస్తా!" అంది ఆమె. "అప్పుడే?" అన్నాడు తను "ఇంకెప్పుడు?" అన్నది ఆమె, ఫక్కున నవ్వుతూ వయ్యారంగా వీధిలోకి పరుగెడుతూ. ఆమె వెళ్లినవైపే బాధగా కొంతసేపు చూసి లోపల కొచ్చాడు తను. కుర్చీలో కవరున్నది. కవరులో తనిచ్చిన డబ్బు తిరిగి ఇస్తున్నట్లుగా ఒక ఉత్తరం, ఉత్తరంలో పదిరూపాయల నోట్లూ ఉన్నాయి ఆఖరున "థ్యాంక్స్"—"మీ విశాలాక్షి"....అని వున్నది. "ఆఁ. నా విశాలాక్షేనా?" అని ఉక్కిరిబిక్కిరయిపోయాడు తను పెల్లుబికివస్తున్న ఉత్సాహోన్నణచుకోలేక.

తరువాత రోజునే ఆమె చిత్రంగీసి, రంగులు వేశాడు. నిజంగా విశాలాక్షే ఆ కాగితంమీద మూర్తీభవించినట్లుగావుంది. ఆ చిత్రం ఆమె కెట్లా ఇవ్వాలో అప్పట్లో తనకు తెలియనేలేదు. రోజూ కాలేజీకి తీసుకు వెళ్ళేవాడు. చిత్రం ఆమె కివ్వడానికి సిగ్గుపడి తిరిగి జాగ్రత్తగా ఇంటికి తెచ్చుకొనేవాడు. ఈ లోగా, ఎవరైనా చూస్తారేమోనని భయంగా కూడా వుండేది.

చివరకు విశాలాక్షే ఒకనాడు తనతో మాట్లాడింది. తను లైబ్రరీ పుస్తకాలు తీసుకొంటున్నాడు. ఆమె పుస్తకాలు తీసుకోవటం పూర్తిచేసుకొని తనను చూసింది....

"సుదర్శన్" అన్నది మెల్లగా వెనకాలే నిలబడి. తను ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు. కొంచెం సిగ్గుపడ్డాడు కూడా. ఆమె ఫక్కున నవ్వేసి, "ఏం చేస్తున్నారు?" అన్నది.

"మీ బొమ్మకటి గీశాను. సాయంకాలం వస్తే...." అని తను చెబుతుంటేనే ఎవరో స్టూడెంట్సు లోపలకొస్తున్న అలికిడి విని ఆమె చాటుగా మెల్లగా బయటకు వెళ్ళిపోయింది.

ఆ నాడు సాయంకాలం అనుకొన్న ప్రకారంగా అతడి గదికి రాగలిగింది విశాలాక్షి. తన చిత్రం చూసుకొని ఎంతో సంతోషించింది "మీ లేఖినిలో జీవకళ వున్నదండి" అన్నదామె తన్నభినందిస్తూ దానికే ఎంతో పొంగిపోయాడు తను.

ఇక విశాలాక్షితో చనువుగా మాట్లాడటం మొదలు పెట్టాడు ఆమె కూడా తన గదికి తరచు వస్తూం డేది సరదాగా కొంతసేపు మాట్లాడుకొనేవారు. తరువాత ఆమె చీకటి పడుతుంటే వెళ్ళిపోయేది ఆ రాత్రంతా తనకు నిద్ర పట్టేదేకాదు. నిజానికి విశాలాక్షి తన్ను ప్రేమిస్తోందో లేదో కూడా తెలుసుకోలేక పోయేవాడు. తన కస్తమానమూ ఆలోచన కలిగిస్తూ వేధించే ప్రశ్న ఒక్కటే—"విశాలాక్షి నన్ను ప్రేమిస్తోందా లేదా?" అనేదే!

ఆ ప్రశ్న ప్రశ్నార్థకంగానే నిలిచిపోయింది దానికి కారణం 'రాజా' ఆగమనం. రాజా ఈ సంవత్సరం క్రొత్తగా వచ్చాడు అతడు వచ్చినప్పట్నుంచీ విశాలాక్షి మనస్సుమారిపోయింది తనవైపు చూడటమే లేదు తన గదికి వచ్చి రెండు నెలల పైగా అయింది రాజా కూడా రెండునెలల క్రితమే వచ్చాడు

రాజా వచ్చిన పది పదిహేను రోజులలోనే తన కళ్ళముందరే జరిగిందొక సంఘటన ఆ నాడు తను ఇంగ్లీషు కాంపోజిషన్ పుస్తకం ఇచ్చి, లెక్చరరుచేత దిద్దించుకొన్నాడు అప్పటికే చీకటి పడుతున్నది. గ్రౌండులో కూర్చొని వున్న విశాలాక్షి, రాజాలు అప్పటివరకూ మాట్లాడుకొని కాబోలు లేచారు. రాజా "ఛీరియో!" అన్నాడు విశాలాక్షి చెయ్యి ఊపుతూ వెళ్ళిపోయింది. తను ఆ సంఘటన చూడలేకపోయాడు తనవస్తువు నెవరో అపహరించినట్లు బాధపడ్డాడు. ఆమె తనకోసమే సృష్టించబడ్డ దనుకొన్నాడు. అలాటి విశాలాక్షి ఇప్పుడింకొకనికి ప్రణయమాల వేసి స్వాగతం చదువుతోంది

మనస్సులో బాధపడటంకన్న ఆమె నడిగి అటో ఇటో తేల్చుకోవా లనుకొన్నాడు. రెండు మూడుసార్లడిగి చూశాడు తమాషాగా సమాధానం చెప్పి తప్పించుకుపోయేది. ఈసారి గట్టిగానే అడిగి చూశాడు. ఘాటుగానే సమాధానం చెప్పింది!

"విశాలాక్షి!" సముద్రపు టొడ్డున కూర్చుని ఆలోచిస్తున్నాడు సుదర్శనరావు. పాతగాథలన్నీ తలుచుకొని మరి కాస్త విచారిస్తున్నాడు తన స్వంత వస్తువును దేనినో కోల్పోయినట్లు బాధపడుతున్నాడు. హృదయంలో ఎవరో వేలెట్టి పొడుస్తున్నట్లున్నది. అవమానం భరించలేక చేతులలో తలదాచుకొన్నాడు

చీకటి పడింది సుదర్శనరావు సముద్రపు టొడ్డునే వున్నాడు కాళ్ళక్రింద భూమి కదులుతున్నది సముద్రం ఘోషిస్తూ పైకి ఎగురుతున్నది తరంగాలు ఉవ్వెత్తుగా లేచి గట్టును తాకుతున్నాయి సుదర్శనరావు పూర్తిగా తడిసిపోయాడు ఏదో భరించరాని బాధతో చీకట్లో సముద్రంలో కరిగిపోదామని కాబోలు చేతులుచాపి ముందుకు నడుస్తున్నాడు.

"సుదర్శన్!" అన్నది ఒక స్త్రీ కంఠం, బిగ్గరగా ఆందోళనతో అతడు వెనక్కు తిరిగి చూశాడు, ఆమె ఎవరో తెల్సుకొందుకు అతడ్ని రెక్కపట్టుకొని తొందరగా సముద్రపొడ్డుకు చేర్చింది ఆమె అతడ్ని కరిగించుకొందామని ఆత్రుతగా వచ్చిన ఒక తరంగం నీరాశతో వెనక్కు మళ్ళింది.

"విశాలాక్షి!" అన్నాడు సుదర్శనరావు బిగ్గరగా. బట్టలు పిండుకొంటూ ముందుకు సాగుతున్నది విశాలాక్షి వెనకాలే మౌనంగా నడుస్తున్నాడు సుదర్శనరావు

ఊళ్ళో విద్యుద్దీపాల కాంతిలో ఒక్కసారి విశాలాక్షిని చూశాడు మిస్టర్ సుదర్శన్. మెల్లగా విశాలాక్షి ఇంటివరకూవచ్చారు ఇద్దరూ. "విశాలా! ఇప్పటికైనా నన్ను పూర్తిగా ప్రేమిస్తున్నావా?" అన్నాడు సుదర్శనరావు గద్గద స్వరంతో, చేతులు ముందుకుచాపి ఆమెను తన కౌగిట్లోకి తీసుకోవాలనే తహతహతో.

విశాలాక్షి దూరంగా తొలగి నిలబడి "ఉష్!" అంటూ విలాసంగా ముక్కుమీదకు చూపుడు వేలు చేర్చి ఫక్కుననవ్వి విద్యుద్దీపపు వెలుతురులో ఛటుక్కున మెరుపులా తనింట్లో ప్రవేశించి, భళ్లున తలుపుమూసింది